మహబూబ్‌నగర్

వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# 8 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 1 ప్రభాత వార్త:** తెలంగాణలోని భారీ ప్రాజెక్టుల్లో ఎస్ఎల్‌బీసీ ఒకటి. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను వినియోగించుకుని నల్గొండ జిల్లాలో ప్రధానంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీటిని, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి అందించేందుకు శ్రీశైలం ఎడమ గట్టు బ్రాంచ్ కెనాల్ (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదలైన సాగునీటి ప్రాజెక్టుజలయజ్ఞంలో భాగంగా (ఎస్.ఎల్.బి.సి) కార్యరూపం దాల్చింది. మూడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో రూ.1925కోట్ల అంచనాతో 2007లో పనులు మొదలయ్యాయి. ఈ ప్రాజెక్టులో 43.93 కిలో మీటర్ల సొరంగం (టన్నెల్) మార్గం నిర్మించడం కీలకమైనది. చుట్టుపక్కల పరిసరాలు దెబ్బ తినకుండా టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో జైపీ నిర్మాణ సంస్థ పనులు చేపట్టింది. దోమల పెంట (ఎస్.ఎల్.బి.సి) ఇన్‌లెట్ వన్, మన్నెవారి పల్లి అవుట్ లెట్, 2 చోట్ల సొరంగాలు, హెడ్‌రెగ్యులేటర్, రెండులింక్ కెనాల్స్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సహా మరికొన్ని పనులు ప్రాజెక్టులో భాగమయ్యాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి సొరంగం ద్వారా నీటిని తీసుకుని నల్గొండ జిల్లా పరిధిలో సుమారు 44 కిలోమీటర్ల (43.930కి.మీ) మేర సొరంగం తవ్వాల్సి వచ్చింది. 2026 జూన్ లోపు ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్ట్ ద్వారా నల్గొండకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టగా...22 ఫిబ్రవరి తేదీన సొరంగంలో జరిగిన దుర్ఘటనలో 8 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వారిని ప్రాణాలతో బయటకు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థలు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టగా మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేశారు. శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్.ఎల్.బి.సి) సొరంగంలో చిక్కుకున్న కార్మికుల జాడ తెలుసుకోవడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆక్వా-ఐ, ప్రోబోస్కోప్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్, (జీపీఆర్) ఉపయోగించుకుంటూసహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 18 సంస్థలు 54 మంది అధికారులు, 703 మంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్ఓ) సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, జీఐఎస్, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్, ర్యాట్ మైనర్స్, హైడ్రా, ఆర్మీ, నేవీ, ఎన్టీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్స్, ఆర్మీ ఇంజనీర్స్, ఆర్మీ మెడికల్ ఆఫీసర్స్, మిలిటరీ సర్వీస్ ఇంజనీర్స్, కేకే బిల్డర్స్ ఢిల్లీ, ఎల్అండ్‌టి, డిఆర్ఎఫ్, నవయుగ, మెగా, రాబిన్ సన్ సంస్థల, అధికారులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహిస్తూ సహాయక బృందాలతో -మిగతా4లో..



సహాయక బృందాలతో మాట్లాడుతున్న అధికారులు

**ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యల్లో 18 ఏజెన్సీలు, 703 మంది రెస్క్యూ నిపుణులు.. అధునాతన సాంకేతికత వినియోగం, నిరంతరం పర్యవేక్షిస్తున్న డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్**

## సృజనాత్మకతతో భోధన చేయాలి

◆జిల్లా విద్యా శాఖాధికారి ఎ.రమేష్ కుమార్ ◆నూతన ఉపాధ్యాయులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారి ఎ. రమేష్ కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 1 ప్రభాతవార్త :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నాగర్ కర్నూల్‌లో 2024 అక్టోబర్లో డీఎస్సీ ద్వారా నియామకం అయిన 129 నూతన ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో గణితం పరిసరాల విజ్ఞానం సబ్జక్ట్స్‌పై శిక్షణలో భాగంగా శనివారం రెండవ రోజు ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా డీఈఓ ఎ.రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో కనీస సామర్థ్యాల సాధనకై కృషి కొనసాగించాలని, విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు సృజనాత్మకతతో భోధన చేయాలని కోరారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించి ఎన్‌రోల్మెంట్ పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శర్ఫుద్దీన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధిక్ అహ్మద్, రిసోర్స్ పర్సన్స్ లక్ష్మీనరసింహారావు, మణికంఠ, శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి, పాండు, నారాయణరావు నెహ్రూ ప్రసాద్, రవి తేజ, ఉపాధ్యాయులు పాల్గొని పలు బోధనాంశాలపై చర్చించారు.

## నత్తనడకన సాగుతున్న ఆలయ పునరుద్ధరణ పనులు

**కృష్ణ, మార్చి1 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గం, కృష్ణ మండలంలోని గుడేబల్లూరు గ్రామంలో వెలిసిన శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయ పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న గోపురాన్ని కూల్చివేసి దాదాపు 6నెలలు గడుస్తున్నా,సంబంధిత అధికారి ఈవో శ్యాంసుందర్ చారి పట్టించు కోకుండా కాలం వెళ్లదీస్తున్నారని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పునరుద్ధరణ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారన్నారు. ఏటా జరిగే లక్ష్మి వెంకటేశ్వరస్వామి జాతర మహోత్సవాలకు ఇంకా నెలరోజులు మాత్రమే మిగిలి ఉండటంతో గోపురం పునరుద్ధరణ పనులు ముగుస్తాయో లేదో అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. దేవాలయ ఆదాయం దాదాపు 50 లక్షలకు పైగా ఉన్నప్పటికీ, గుడి పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదని గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలలో జరిగే జాతర సమయానికి పునరుద్ధరణ పనులు పూర్తి కాకపోతే సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఆలయ పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

గల్లంతైన 8 మంది జాడ కోసం

## అన్వేషణ కొనసాగుతోంది

● రెస్క్యూ టీమ్స్‌తో పాటు యంత్రాల సహాయంతో సమాంతరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి : మంత్రి జూపల్లి కృష్ణారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 1 ప్రభాతవార్త:** ఎల్ఎల్బీసీ సొరంగంలో శిథిలాల తొలగింపు, డీ వాటరింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, ఒ వైపు రెస్క్యూ టీం మరోవైపు యంత్రాలతో ఈ పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, ఎస్ఎల్బీసీ టెన్నెల్‌లో చేపడుతున్న సహా యక చర్యలపై శనివారం సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు, డీవాటరింగ్ పనుల పురోగతిపై రెస్క్యూ బృందం ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేపీ క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. మొత్తం 8 మంది గల్లంతు కాగా జీపీఆర్ ద్వారా ఇప్పటికే 4 జాడ కనుగొన్నారని, ఆప్రాంతంలో తవ్వకాలు కొనసాగుతున్నాయని, రేపటి సాయంత్రంలోగా -మిగతా4లో..




## దివ్యాంగులందరూ యూడిఐడి కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి

◆ వీసీలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్



కలెక్టర్ కార్యాలయంలో వీసీలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మార్చి 1 ప్రభాతవార్త :** దివ్యాంగులందరూ యూడి ఐడి (యూనిక్ డిజేబుల్ ఐడి) కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం దివ్యాంగులకు యూనిక్ డిజేబుల్ ఐడి అంశంపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ దివ్యాంగులందరూ యూనిక్ డిజేబుల్ ఐడి కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీసేవ ద్వారా, లేదా వ్యక్తిగతంగా యుడి ఐడి పోర్టల్ నుంచి దరఖాస్తు చేసుకొని, వైద్యుల స్లాట్ బుకింగ్ ద్వారా అసెస్మెంట్ చేయించుకుని వైకల్య శాతానికి సంబంధించిన డిజబులిటీ సర్టిఫికెట్ పొందవచ్చని చెప్పారు. యూడి ఐడి ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఇతర రాష్ట్రాల్లో చదువు కోవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. దివ్యాంగులకు యూడిఐడి కార్డు స్పీడ్‌పోస్ట్ ద్వారా నేరుగా ఇంటి చిరునామాకు అందుతుందని సీఈఓ తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఏదైనా సౌకర్యం పొందాలంటే దివ్యాంగులకు యూడిఐడి కార్డు తప్పనిసరన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ తో సమన్వయం చేస్తూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి, నూతనంగా కావాల్సిన సదుపాయాలపై ప్రతిపాదనలు అందజేయాలని సీఈఓకలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నది అందరికీ యూడి ఐడి కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న మీసేవా కేంద్రాల నిర్వాహకులకు, పంచాయతీ కార్యదర్శులకు, విఓఏలకు, సీసీలకు, ఎంపీడీఓలకు,ఏడిఎంలకు యూడిఐడి దరఖాస్తుల నమోదుపై శిక్షణ అందించాలని ఈడిఎమ్ కు ఆదేశించారు. నూతనంగా యూడిఐడి కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూడిఐడి కార్డు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ యాదయ్య, డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమాధికారి సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి

టిజిఎంఎఫ్‌సి చైర్మన్, పిసిసి ఉపాధ్యక్షులు ఒబెదుల్ల కొత్వాల్



శిక్షణపూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేసిన దృశ్యం

**మహబూబ్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త :** అక్బర్ సన్స్ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన టైలరింగ్ సర్టిఫికేట్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి ఉపాధ్యక్షులు టిజిఎంఎఫ్‌సి చైర్మెన్ ఒబెదుల్ల కొత్వాల్ గారు పాల్గొన్నారు. అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఇండియన్ ఓవర్సీస్ కన్వీనర్ అక్బర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్బర్ సన్స్ హెల్పింగ్ ఫౌండేషన్ ద్వార నిరుపేద మహిళలకు శిక్షణ నిచ్చి తద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథి కొత్వాల్‌ను నిర్వాహకులు మెమెంటో ఇచ్చి సత్కరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. శిక్షణలో ప్రతిభ కనపరిచిన మహిళలు మొదటి, ద్వితీయ, తృతీయ, బహుమతులను కొత్వాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా టిజిఎంఎఫ్‌సి చైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్ మాట్లాడుతూ, అక్బర్ అండ్ సన్స్ హెల్పింగ్ ఫౌండేషన్ నిర్వకులను, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలందరినీ అభినందించారు. మహిళలకు శిక్షణ ఇచ్చి తద్వారా మహిళలకు ఉపాధి, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. టిజిఎంఎఫ్‌సి విద్యావంతులు,నిరుద్యోగ మైనారిటీల కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణలను అమలు చేస్తుందని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్న వారి అభ్యున్నతి సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి తెలంగాణా ప్రభుత్వం కృషి చేస్తుందని, యువతకు మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి -మిగతా4లో..



## బోడగట్టుపై జాలువారుతున్న గంగాజలం



నీరు వస్తున్న రాతి గుండుకు పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

**ఖిల్లాఘణపురం, మార్చి 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లమాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బోడగట్టుపై ఓ రాతి గుండు కింద నుండి శనివారం గంగాజలం బయటకు వస్తున్న దృశ్యాన్ని ఈర్లతాండ కు చెందిన కొందరు పశువుల కాపరులు గుర్తించారు. బోడగట్టుకు సమీపంలో ఉన్న తాండలకు చెందిన గిరిజనులు అక్కడికి వెళ్లి పూజలు చేయడం ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే 10 సంవత్సరాల క్రితం ఇదే గుండు కింద నుండి నెలరోజుల పాటు నీరు ఇలాగే బయటకు వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. దాదాపు 200 మీటర్ల ఎత్తు పైనున్న గుట్ట నుండి నీరు రావడం దేవుడి మాయ అని గ్రామస్తులంటున్నారు. గతంలో ఈ గట్టు గుహలో వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉండేదని ఇప్పటికీ ఆ గుహలో ఆనవాళ్లు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ సారి శివాలయం నిర్మాణం ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈర్ల తాండ తాజా మాజీ ఉపసర్పంచ్ ఎస్.టోగ్య , పి.సోముల, హరి సింగ్, ఏద్య, పలువురు గిరిజనులు ఉన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**నవాబుపేట, మార్చి1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఫతేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్వయం పరిపాలనలో భాగంగా విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలిగా ఎం. చాముండేశ్వరి, జిల్లా విద్యాధికారిగా ఈ చరణ్, జిల్లా కలెక్టర్‌గా గీతిక పి.అనూష, అడిషనల్ కలెక్టర్‌గా దుర్గాప్రసాద్ ఆర్డెడిగా డి. శివకుమార్ తహసిల్దార్‌గా శ్రీధర్ వ్యవహరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వెంకటమ్మ, ఉపాధ్యాయులుమాట్లాడుతూ విద్యార్థుల్లోదాగిఉన్న వారి సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని తెలియజేశారు. విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది అన్నారు. విద్యార్థి దశ నుండే కృషి పట్టుదల క్రమశిక్షణ ఉంటే చిన్ననాటి నుండి లక్ష్యాలను పెట్టుకొని వాటినీ సాధించుకునే లక్ష్యంతో ముందడుగు వేస్తుంటే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులంతా చక్కగా చదివి పదవ తరగతిలో 10 జిపిఏ సాధించాలని కోరారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఛాత్రోపాధ్యాయులు అందరికీ దశరథ్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్యేలకు ఘన సన్మానం



బిజెపి ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, మార్చి 1 ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్లో చిక్కుకున్న 8 మంది కార్మికుల పరిస్థితులు తెలుసుకోవడానికి వెళ్తున్న బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు కే.మహేశ్వర్‌రెడ్డి, హరిబాబు రామారావుపవర్, పాయల్ శంకర్, పైడి రాకేష్ రెడ్డి, సూర్యనారాయణలను జాతీయ రహదారిపై గల వెల్దండ మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతూ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అక్కడ నెలకొన్న పరిస్థితులను తెలుసుకో వడానికి వెళ్తున్నామని ప్రమాదం దురదృష్టకరమని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నెంట తాంబాల్ తాటికొండ కృష్ణారెడ్డి, గుద్దటి రామస్వామి, పాండుచారి,విష్ణుగౌడ్,రవి,జంగయ్య, కొండలు,శ్రీశైలం ముదిరాజ్, యాదగిరి, పాండు, పెద్దయ్య, లక్ష్మయ్య, రవి, వెంకటేష్, గణేష్, కుమార్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## 5 నుంచి మద్దూర్లో 144 సెక్షన్ అమలు

**మద్దూర్, మార్చి 1 ప్రభాతవార్త :** ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందువలన మద్దూర్‌లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తాసిల్దార్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల దగ్గర ఏఏ షాపుల్లో జిరాక్స్ సెంటర్లు ఉన్నాయో పరీక్ష సమయం కంటే ముందు షాపులు మూసివేయాలని పరీక్ష అనంతరం తెలుసుకోవాలని తాసిల్దార్ షాప్ యజమానులకు తెలియజేశారు.

## అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న యువకులు

**ఆత్మకూరు, మార్చి 1 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని పిన్నంచర్ల గ్రామ శివారులో శుక్రవారం రాత్రి అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని గ్రామానికి చెందిన యువకులు అశోక్,గోపాల్ యాదవ్ ,నీలారెడ్డి ,కళ్యాణ్ ,శివ తదితరులు గోవులను అడ్డుకోవడమే కాకుండా గ్రామ శివారులోని గోశాలకు తరలించారు. అమరచింత మండలం కేంద్రం నుండి హైదరాబాద్‌కు బొలెరో వాహనంలో మహమ్మద్ ఫయాజ్ ఖురేషి, మహమ్మద్ ,సల్మాన్ ,ఖురేషి ఎవరు ఆరు గోవులను, మూడు గేదెలను అక్రమంగా బొలెరో వాహనంలో బంధించి తీసుకెళ్తుండగా రాత్రి పూట వాహనాన్ని అడ్డుకొని ఎలాంటి రసీదులు లేకపోవడంతో గ్రామ శివారులో గల గోశాలకు గోవులను తరలించినట్లుగా యువకులు తెలిపారు. శనివారం రోజు అక్రమంగా తరలిస్తున్న గోవులకు రక్షణ కల్పించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గోవులను తరలిస్తున్న విషయాన్ని పిన్నంచర్ల గ్రామానికి చెందిన యువకులు తమ దృష్టికి తేవడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లుగా ఎస్సై నరేందర్ తెలిపారు.

## డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయాలని జెసికి వినతి



జెసికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ పట్టణంలోని శ్రీకృష్ణ టెంపుల్ గుట్ట కింద రోడ్ నెంబర్ 9 భాగ్యనగర్ కాలనీకి సీసీ రోడ్డులు, డ్రైనేజీ లు నూతనంగా మంజూరు చేయాలని కాలనీవాసులు జాయింట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ మాజీ అధ్యక్షులు ఆశన్న, ప్రధాన కార్యదర్శి చీకిరాల పట్టాభి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కాలనీలో ఉంటున్న మా సమస్యలను అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీకి సిసి రోడ్లు డ్రైనేజీలు మంజూరు చేసి ప్రజలకు ఇబ్బందులు కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బోరెల్లి శంకర్, శివరాములు, శ్రీశైలం, వెంకటస్వామి, శివకుమార్, శ్రీనివాసులు, రాజేష్, శ్రీను, శ్రీకాంత్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ సంబురాలు

**మహబూబ్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** జాతీయ సైన్స్ దినోత్సవం ప్రభుత్వ బేసిక్ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాల లో ఘనంగా సైన్స్ సంబురాలు జరిగాయి.విద్యార్థులు చిట్టి ప్రయోగాలతో ఆకట్టుకున్నారు. టిఎల్ఎం మేల, క్విజ్, రంగోలీ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. కార్యక్రమానికి ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్,పాఠశాలప్రధానోపాధ్యాయులు టి.విజయ్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు సి.ఎన్ సునీత,పల్లవి,అరుణమ్మ, పరమేశ్వర్, వెంకటస్వామి,శివ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

## సదరం గుర్తింపు కార్డు కోసం

# యుడిఐడి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**మహబూబ్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త :** సదరం గుర్తింపు కార్డు కొరకు యుడిఐడి పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ తెలిపారు. శనివారం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్లు, డిఆర్డిఓ, డిడబ్ల్యుఓ, డిసిహె చ్ఎస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యుడిఐడి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ, విఎల్ఇ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితోపాటు యుడిఐడి పోర్టల్, స్వంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.క్యాంపుల వివరాలు కూడా సందేశం (మెసేజ్) ద్వారా తెలియజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ ప్రక్రియను మార్చి, 2025 మాసం నుండి అమల్లోకి తీసుకురావడం జరి గిందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యుడిఐడి ( యూనిక్ డిజాబ్లిటీ ఐడి) కార్డును పొందవచ్చని ఆమె తెలిపారు. సదరం కార్డును కూడా పోస్టల్ ద్వారా అభ్యర్థులకు చేరవేయడం జరుగుతుందని ఆమె అన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, వారికి ప్రస్తుతం ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు వర్తిస్తాయని ఆమె పేర్కొన్నారు. దివ్యాంగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో సదరం క్యాంపులను నిర్వహించేందుకు 38 మెడికల్ బోర్డులను గుర్తించడం జరిగిందని ఆమె తెలిపారు. సదరం క్యాంప్ నిర్వహించే సందర్భాల్లో దివ్యాంగులకు అసౌకర్యం కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకునే విధానంపై మీసేవ నిర్వాహకులకు శిక్షణను ఇవ్వాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అధికారులకు సూచించారు. పీఎం కుసుం ప్రాజెక్ట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామీణ మహిళా సంఘాలను ప్రోత్సహించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారి నుండి దరఖాస్తు స్వీకరించి స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కలెక్టరేట్ నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

## వీపనగండ్ల మండల కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

**వీపనగండ్ల, మార్చి 1 ప్రభాతవార్త:** గత అనేక సంవత్సరాల క్రిందట వీపనగండ్ల మండల కేంద్రంలో 10 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. దీన్ని గ్రామస్తుల కృషి ఫలితంగా అప్పటి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అయిన వంగూరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేయడం జరిగింది. గత నాలుగు సంవత్సరాల కిందట ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా సిహెచ్‌సి గా ఏర్పాటు చేస్తూ 30 పడకల ఆరోగ్య కేంద్రానికి అప్డేట్ చేస్తూ మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం అది మండల కేంద్రంలో నడుస్తున్నది అయితే ఈ ప్రాంతంలో యువతులు ఎక్కువగా నర్సింగ్ విద్యను అభ్యసించేటందుకోసం కర్నూలుమహబూబ్‌నగర్ హైదరాబాదు వనపర్తి ప్రైవేటు కళాశాలలకువెళ్లివిద్యను అభ్యసిస్తున్నారు.పానగల్, వీపనగండ్ల, చెల్లెపాడు, శ్రీరంగాపూర్ తదితర మండలాల నుండి అధిక సంఖ్యలో సుదూర ప్రాంతాలకు బాలికలు వెళ్లి నర్సింగ్ విద్యను అభ్యసించి వస్తున్నారు. అయితే ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యంపైన గ్రామీణ ప్రాంతాల వారికి కూడా అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పంతో ముందుకు కొనసా గుతున్నట్లు ప్రకటనల ద్వారా తెలుస్తుంది. అయితే ఇక్కడి మారు మూల ప్రాంతాలలో ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తే వీరికి అనేక రకాలుగా ఖర్చు తగ్గడంతో పాటు బాలికలు విద్యను అభ్య సించే అవకాశం ఎక్కువగా ఉంటుంది ఇక్కడి నుండి దాదాపు 200 మందికి పైగా బాలికలు విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు పోతున్నారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉన్నది ఈ కళాశాలలో దాదాపుగా20050 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటే వారిలో బాలికలు 100 మంది దాకా తమ ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నర్సింగ్ కళాశాల ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఇటు కొల్లాపూర్ నియోజక వర్గానికి వనపర్తి జిల్లాలోని ఈ మారుమూల ప్రాంతాలకు పిల్లలు చదువుకోవడానికి అవకాశాలు మెండుగా ఉండి వారు స్వయం ఉపాధి పై బతకడానికి అవకాశాలు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని నేడు వనపర్తి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా వాసి కావడంతో పాటు వనపర్తి జిల్లాలో విద్య వైద్యానికి పెద్దపీట వేస్తాడని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు. వీరి ఆశలకు అనుగుణంగా వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల ఆరోగ్య కేంద్రం నుండి వంద పడకల ఆరోగ్య కేంద్రంగా అప్ గ్రేడ్ చేస్తూ ఇక్కడ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులు ఆశలు నెరవేరుతాయని ఈప్రాంత విద్యార్థులు కోరుతున్నారు.



మండల కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి పత్రం అందిస్తున్న గ్రామ ప్రజలు

## నేటి నుంచి పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం

◆ప్రత్యేక ప్రార్థనలకు మసీదుల ముస్తాబు

◆ఇఫ్తార్, తరావీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



రంజాన్ మాసాలకు శోభయామానంగా తయారైన మసీద్

**కల్వకుర్తి, మార్చి 1 ప్రభాతవార్త:** రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో చేసే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం ఎన్నో రెట్ల ఫలితాలను అందిస్తుందని వారి విశ్వాసం. అల్లాహ్ ఆశీస్సులు అందించే పవిత్ర రంజాన్ కోసం ముస్లింలు సంవత్సరమంతా ఎదురుచూస్తుంటారు. నేటి నుంచి ఉపవాస దీక్షలు మొదలయ్యాయి. రోజా (ఉపవాస దీక్ష) పాటించే ముస్లింలు నమాజ్‌కు మొదటి ప్రాధాన్యతనిస్తారు. నమాజ్ కోసం అన్ని మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సూర్యోదయానికి ముందు (సహర్) నుంచి సూర్యాస్తమయం (ఇఫ్తార్) వరకు ఉపవాసదీక్షలు పాటిస్తారు. రోజుకు 5 పూటల నమాజు చేస్తారు. దీనికి అదనంగా రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు నిర్వహించే తరావీహ్ నమాజులో ఖురాన్ పఠనం గావిస్తారు.

**దానధర్మాలకు ప్రాధాన్యం:** రంజాన్ మాసాన్ని దివ్యఖురాన్ భూమిపై అవతరించిన మాసంగా భావిస్తారు. ఈ నెలలో నఫిల్‌వి చదివితే ఖీఫరజ్ చదివినంతగా... అంటే 70సార్లు నమాజ్ చేసిన పుణ్యం వస్తుందనిఇస్లాం గ్రంథాలు ప్రబోధిస్తున్నాయి.ఈ మాసంలో ముస్లింలు దానధర్మాలకు (జకాత్, ఫిత్రకు) ప్రాధాన్యతనిస్తారు. ఈ నెల రోజుల్లో చేసిన దానాలు 70 రెట్లు అధిక ఫలితాన్ని అందిస్తాయని వారి నమ్మకం. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఫిత్ర (నిర్ణీత దానం) తప్పనిసరిగా చేయాలని నియమం...

**హలీం రుచులు సిద్ధం:** రంజాన్ మాసంలో లభించే ప్రత్యేక వంటకంహలీం.కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వరకే పరిమితమైన హలీం దశాబ్దకాలంగా రాష్ట్రంలోని నగరాలకు, పట్టణాలకు గ్రామాలకు విస్తరించింది. ముఖ్యంగా కల్వకుర్తి పట్టణంలో పెద్ద ఎత్తున రంజాన్ స్పెషల్ హలీం విక్రయాల కోసం స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

### రంజాన్ మాసంలోనైనా నమాజ్‌లకు సమయం కేటాయిస్తాం...



యేడాది పాటు ప్రతిరోజు5 పూటలు నమాజ్ చేయడానికి పని ఒత్తిళ్ల వల్ల సమయం కేటాయించలేకపోతాం. కానీ రంజాన్ మాసం ప్రారంభం కాగానే ప్రతి రోజు చదివే 5 పూటల నమాజ్‌తో పాటు తరావీ నమాజ్‌ను కూడా పాటిస్తాం. రంజాన్ మాసంలో చదివే నఫీల్ నమాజ్ మరియు ఫరజ్ నమాజ్‌కు ఎంతో పుణ్య ఫలం లభిస్తుంది.

**— అబ్దుల్ ఖాదర్, కల్వకుర్తి ముస్లిం సోదరులు**

### మానవులను సంస్కరించే మాసం



మానవులను సంస్కరించి మంచి మార్గంలో పయనింపజేసేందుకు రంజాన్ మాసం ఎంతో దోహదపడుతుంది. మానవులు ఏ విధంగా నడుచుకోవాలి, దైవం,సమాజం పట్ల ఎటువంటి బాధ్యతలను నిర్వర్తించాలనే అంశాలను కూడా ఈ మాసం తెలియజేస్తుంది. మానవాళికి సర్వశుభాలను చేకూరుస్తుంది.రంజాన్‌మాసంలో ముస్లింసోదరులు అతి పవిత్రంగా భావించి 5పూటల నమాజ్‌తో పాటు తరావీ నమాజ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు నమాజ్‌లను జమాత్‌తో పాటిస్తారు.

**— ఇమామ్ సాజీద్, కల్వకుర్తి**

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థుల బృందం

**చిన్న చింతకుంట, మార్చి 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠశాలలో పాఠ్యాంశాలను చక్కగా బోధించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠ్యాంశాలను బోధిస్తున్న అంశాలను గమనిస్తూ డీఈవోగా వ్యవహరిస్తున్న శ్రవణ్ తేజ్ పరిశీలించారు.చక్కగా విద్యా బోధన అందించిన విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కలెక్టర్‌గా హర్షిక,డీఈఓగా శ్రవణ్ తేజ్, ఎంఈఓగా మదిహ తబుసం,కామేషా తబుసంతో పాటు 27 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.వీరిలో చక్కటి బోధన అందిం చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులకు వ్యవహరించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

**మక్తల్ టౌన్, మార్చి 1 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణం లోని ఎంపీపీఎస్ ప్లే గ్రౌండ్ పాఠశాలలో స్వయం సుపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠశాలలో ఒకరోజు విధులు నిర్వహించారు.కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ప్రధానోపాధ్యాయులు జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఇష్టంతో కష్టమైన సరే భవిష్యత్తులో వివిధ రంగాలలో విద్యార్థులు ఎదిగి ఉన్నత పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు.పాఠశాల ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉద్యోగాలు సంపాదించి ప్రజలకు సేవ చేయాలని ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఇష్టంతో కష్టమైన సరే భవిష్యత్తులో వివిధ రంగాలలో విద్యార్థులు ఎదిగి ఉన్నంత పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామని అన్నారు. బాల్య దశ నుండి విద్యార్థుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీయాలనే ఆలోచనతో పాఠశాల స్థాయిలోనే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని నాయకత్వ లక్షణాలను అభివృద్ధి పరిచేందుకు క్రమశిక్షణను పెంపొందించేందుకు స్వయం పరిపాలన దినోత్సవం దోహదపడుతుందనివిద్యార్థుల్లో ఒక ఆకాంక్షను ఏర్పరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వనజ, వేణుగోపాల్, రాము, రజిని పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు నవతేజ కలెక్టర్‌గా శివాని డీఈవోగా హరిప్రియ ఎంఈఓ గా అఖిల్ ఉపాధ్యాయులుగా చందన, గౌతం, ఆశమ్మ, నవదీప చారి, శ్రీకాంత్, భవాని, హారిక, కిరణ్ తేజ, కళ్యాణ్ కుమార్ కావడం జరిగింది.



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

## అతివేగంతో ఇసుక ట్రాక్టర్ బోల్తా



లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

**ఉప్పునుంతల, మార్చి 1 ప్రభాతవార్త :** ప్రభుత్వ పనుల కోసం అని స్థానిక తహసీల్దార్ అనుమతితో ఇసుకను తోడేస్తున్న మాఫియా అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు అతివేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలం లోని దుందుభి వాగు నుంచి ఇసుకను తీసుకెళ్తుండగా అతివేగంగా వెళ్తూ లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో బోల్తా పడింది. అనుమతుల పేరిట అధికంగా ట్రిపుల్ కొట్టాలనే లక్ష్యంతో అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏమి కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు అనుమతులు ఇచ్చిన వెంటనే వారి పరిశీలన ఉండాల్సి ఉండగా నిఘా విభాగం ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఉన్న వారు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానుల వద్ద ముడుపులు దండుకొని ఇసుకను టార్గెట్ కన్నా అధికంగా అనుమతులు ఇవ్వడంతో వారు అతి వేగంతో వెళ్తూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలో అక్రమ ఇసుక రవాణా దుర్వినియోగం అధికంగాజరుగుతుండడం అధికారులు పట్టించుకోనట్లు వ్యవహరించడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు అనుమతులు ఉన్నప్పటికీ జాగ్రత్తలు పాటించకపోతే ఇలాంటి సంఘటనలు మరిన్ని జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**పానుగల్, మార్చి 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో కేఎల్ఐ కాలువలో మండల కేంద్రంకు చెందిన ఎండి రహ్మతుల్లా (44) శనివారం శవమై కనిపించాడు. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం సుమారు 4:00 గంటల సమయంలో పోటెలు కోసేది ఉందని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మృతుని ఇంటికి వచ్చి బయటకు తీసుకువెళ్లడనీ కాసేపటికే జూనియర్ కాలేజ్ వద్ద కేఎల్ఐ కాలువలో శవమై కనిపించగ గంటలకు బాటసారులు పోలీసులకు సమాచారం ఇవ్వగ మృతదేహాన్ని కాలువ నుండి వెలికి తీసి శవ పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మృతుని బంధువు చాపలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా మృతదేహంపై గాయాలు ఉండడంతో ఇది ముమ్మాటికి హత్యేనని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులు స్వాధీనం



ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్న దృశ్యం

**మద్దూర్, మార్చి 1 ప్రభాతవార్త:** మద్దూర్ మండల పరిధిలోని కాజీపూర్ వాగు నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను నాగంపల్లి గ్రామ శివారులో రెవెన్యూ సిబ్బంది స్వాధీన పరుచుకున్నారు. నాలుగు ట్రాక్టర్ల ఇసుకను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పొలాల దగ్గర డంపు చేశారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే డబ్బులు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

## కాకతీయ పాఠశాలలో ఘనంగా సైన్స్ డే

**గద్వాల, మార్చి 1 ప్రభాతవార్త:** వైవిధ్యమైన ప్రణాళికలను ప్రదర్శించిన విద్యార్థులు ఈ వేడుకలను ఎంతో ఉత్సాహంతో ప్రారంభించిన గద్వాల ఎంఈఓ శ్రీనివాస్ పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ జోషి ప్రిన్సిపల్ సీమ జేమ్స్, సైన్స్ డే ప్రదర్శనలను గద్వాల ఎంఈఓ సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు సందర్శించి వారి, వారి అభిప్రాయాలను వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గో గ్రీన్ చెట్లను కాపాడుదాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం, అనేఅంశం చాలా ఆకట్టుకుందని పాఠశాలను సందర్శించిన వారు ప్రశంసించడం జరిగింది. సైన్స్‌డే వంటి ప్రదర్శనలు పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీసే ప్రదర్శనలను నిర్వహించటం లో కాకతీయ పాఠశాల ప్రత్యేకమైనదని ఎంఈఓ అభినందించడం జరిగింది. నేటి ప్రదర్శనలో వారి యొక్క చిన్ననాటి తన ప్రదర్శనలను జ్ఞాపకం చేసుకోవడం జరిగింది.

## ప్రభుత్వ కళాశాలను పరిశీలించిన ఎంపీడీవో



**నవాబుపేట, మార్చి1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్మనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను మండల అధికా రులు ఎంపీడీవో జయరాంనాయక్ సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి అవసరాలకు తరగతి గదుల ఫర్నిచర్‌కి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో 12 డ్యూయల్ డెస్క్ ఫర్నిచర్ టేబుల్లు అవసరం ఉందని ఫర్నిచర్ విద్యార్థులకు సరిపోవడం లేదని ప్రిన్సిపల్ మద్దిలేటి ఎంపీడీవోకు వివరించారు. వెంటనే తాగినీటి సమస్యలు, ఫర్నిచర్‌ను కళాశాలకు అందించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. కళాశాలకు ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగకుండా పరిశుభ్రత పాటించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి గ్రామపంచాయతీ కార్యదర్శి మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌లో ప్రతిభ కనబరిచిన కేజీబీవీ విద్యార్థులు

**పెబ్బేరు, మార్చి 1 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణానికి చెందిన కస్తూర్బా గాంధీ విద్యార్థిలు పీఎం శ్రీ పాఠశాలల జిల్లాస్థాయి సైన్స్ మేళా,గణితమేళా గురుకుల పాఠశాల చిట్యాలలో జరిగింది.ఈ మేళాకు జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలు 15 పాల్గొన్నాయి. ప్రతి పాఠశాల నుండి గణితం, సైన్సులో ఒక ప్రదర్శన చేసారు. ఈ మేళాకు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి మహమూద్ అబ్దుల్ ఘని, ఏఎంఓ మహానంది, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శేఖర్, ఎస్ఓ యుగంధర్, జిసిడిఓ శుభ లక్ష్మి, జిల్లా సైన్స్‌అధికారి శ్రీనివాసులు, జిల్లా రిసోర్స్ పర్సన్ బలరాముడు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గురువయ్య గౌడ్, అన్ని పాఠశాలలఉపాధ్యాయులు,విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు అందివ్వడం జరిగింది. ప్రతి పాఠశాలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది.

## ఆత్మకూరును డివిజన్‌గా ప్రకటించండి

**ఆత్మకూరు, మార్చి 1 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని బిజెపి జిల్లా కమిటీ నాయకులు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ ఆనంద్ తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం రోజు ఆత్మకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో భాగంగా ఆత్మకూర్ కు తీరని అన్యాయం జరిగిందని గతంలో ఆత్మకూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని దాదాపు 60 రోజులు నిరంతర ఉద్యమం నిర్వహించిన సమయంలో ఆనాడు తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆత్మకూరులో ఉద్యమకారులను ఉద్దేశించి ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు న్యాయమైన విషయంగా పేర్కొన్న విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో రెండు రెవిన్యూ డివిజన్లను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆత్మకూర్ పట్టణాన్ని కూడా రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటుచేసి తగిన న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో మక్తల్ లో జరిగిన బహిరంగ సభలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకుని ఆత్మకూర్ ప్రజల చిరకాల కోరిక అయినటువంటి ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసి రుణం తీర్చుకోవాలని వారి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై అధికార పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పై ఒత్తిడి తేవాలని లేనిపక్షంలో రానున్న కొద్ది రోజుల్లోనే బిజెపి ఆధ్వర్యంలో నిరంతర ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కమిటీ నాయకులు బాలకృష్ణ, మండల సూరి, వెంకట రాములు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు వేరు శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఉప్పునుంతల, మార్చి1 ప్రభాతవార్త:** రేపు సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం ఆధ్వర్యంలో వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు,సంఘ సిఇఓ కొత్త రవీందర్‌రావులు తెలిపారు. ఉప్పునుంతల అచ్చంపేట మార్గంలో ఉన్న గోదాం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, సంఘ సిఇఓ కొత్త రవీందర్ రావులు కోరారు.

## మద్యం మత్తులో దాడి : కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాఘణపురం, మార్చి 1 ప్రభాతవార్త :** మద్యం మత్తులో స్నేహితుడిపై కర్రలతో దాడి తీవ్ర గాయాల పాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన నాగరాజు, అల్లమాయపల్లి గ్రామానికి చెందిన బాలరాజులు ఇద్దరు కలిసి ఫిబ్రవరి 27 రాత్రి మద్యం తాగారు. ఇరువురి మధ్యన వాదనలు పెరిగి బాలరాజు, నాగరాజు పై కర్రతో దాడి చేశారు. అరుపులకు పక్కనే ఉన్న నరసమ్మ ,నాగరాజు భార్య సంతోషకు విషయం చెప్పింది. అప్పటికే తీవ్ర గాయాల పాలైన నాగరాజును స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి తరలించారు. శనివారం బాధితుడు భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

## హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్ టెక్నాలజీ డిప్లమా కోర్సులకు దరఖాస్తులు

**గద్వాల, మార్చి 1 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని యువతకు 2025-26 డిప్లమా కోర్స్ లకు సంవత్సరానికి గాను హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్ టెక్నాలజీ డిప్లమా కోర్సులకు దరఖాస్తులను కోరుతున్నట్లు చేనేత,జౌళి శాఖ సహాయ సంచాలకులు ఈ.గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పొట్టిశ్రీరాములు తెలుగుయూనివర్సిటీ నాంపల్లి హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వారు హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లమాకోర్సులో 3సంవత్సరాల పాటుశిక్షణఇవ్వనున్నట్లు తెలిపారు.ఏప్రిల్ 2025 మొదటివారం నుండి అడ్మిషన్స్ ప్రారంభిస్తున్నట్లు,ఆసక్తిగల అభ్యర్థులుదరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరములకు చేనేత,జౌళిశాఖ సహాయ సంచాలకులకార్యాలయమును సంప్రదించగలరని కోరారు.

## లాంబ్డా సైహాలో థ్రిన్ మందును రైతులు కొనుగోలు చేయవద్దు : డిఎఓ

**గద్వాల, మార్చి 1 ప్రభాతవార్త :** ఉప వ్యవసాయ సంచాలకులు పెస్టిసైడ్ టెస్టింగ్ ల్యాబ్ వారి నివేదికానుసారం లాంబ్డా సైహాలో థ్రిన్ 5 ఈసీంఈసీ విత్ యాక్టివ్ ఇంగ్రిడియంట్స్ 3.07 (ట్రేడ్ నేమ్ పిరిక్స్ 5) బ్యాచ్ నెంబర్ 24092601 గల పురుగుమందు తప్పుగా బ్రాండ్ చేయబడినదిగా నిరూపితమైనందున ఈ బ్యాచ్ నెంబరు గల పురుగు మందును రైతులు ఎవరు కొనుగోలు చేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ ప్రకటన ద్వారా తెలిపారు.

## ఘనంగా గ్రామీణ ఆరోగ్యం, పోషణ దినోత్సవం

**శ్రీరంగాపూర్ మార్చి 1 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంగన్వాడి 1వ సెంటర్లో విహెచ్ఎన్‌డి (విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెబ్బేరు ప్రాజెక్టు సిడిపిఓ బాలేశ్వరమ్మ, సూపర్‌వైజర్ వినోద, గ్రామ పంచాయతీ సెక్రటరీ నందకిషోర్ హాజరయ్యారు. ఇందులో భాగంగా 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయరాదని అలాగే చిన్న పిల్లలని బాల కార్మికులుగా ఉంచరాదనే అంశాల పైన చర్చించడం జరిగింది. అలాగే అంగన్‌వాడి 1వ సెంటర్లో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు వారి తల్లులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## అమరవీరులకు ఘన నివాళి

**ఆత్మకూరు, మార్చి 1 ప్రభాతవార్త :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన ఏబిసిడి వర్గీకరణ సాధనలో భాగంగా ఉద్యమ సమయంలో అసువులు బాసిన అమరవీరులకు ఆత్మకూరు మండల ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శనివారం రోజు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు జపాగా లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి సోంబాబు తదితరులు మాట్లాడుతూ అమరవీరుల త్యాగ ఫలితమేనేడు ఉభయ తెలుగు రాష్ట్రాలలో వర్గీకరణ ఫలాలను అందుకోగలిగిన వారమని అందుకుగాను మాదిగలు జీవితాంతం అమరవీరులను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు అజ్యపాగ మాసన్న, జానకి రాములు, గాలి పంపు శ్రీనివాసులు, దండు శ్రీనివాసులు, భగవంతు, కిషోర్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి

**ఖిల్లాఘణపురం, మార్చి 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మామిడి మాడ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త గోపాల్ అనారోగ్యకారణంగా హైదరాబాద్‌లోని అత్తాపూర్ జా య్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన మాజీ మంత్రి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందు తున్న గోపాల్‌ను పరామర్శించారు.మెరుగైన చికిత్స అందజే యాలనిఆసుపత్రి వైద్యులకుసూచించారు. ధైర్యంగా ఉండాలని అన్నిరకాలుగా ఆదుకుంటామని అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

## గర్భిణీలు, బాలింతలు సకాలంలో టీకాలు తీసుకోవాలి

**పానుగల్, మార్చి 1 ప్రభాతవార్త :** సకాలంలో గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారంతో పాటు టీకాలు తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తద్వారాఅంటువ్యాధులు సోకవనీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శనివారం ఆయన బండపల్లిలో నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలింతలు గర్భిణీల ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉచితంగా లభించే టీకాలను మాత్రలను తీసుకోవాలనిదీంతో మీకు మీ పిల్లలకు ఎలాంటి జబ్బులు రాకుండా జాగ్రత్త పడవచ్చని అన్నారు. మొదటి రెండవ డోస్ (టి.టి)లు తీసుకోవడం వలన పిల్లలకు ధనుర్వాతం రాకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ రమాదేవి, శైలజా, ఆశ కార్యకర్త విజయ, అంగన్వాడీ టీచర్ చెన్నమ్మ, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, గ్రామ వృద్ధులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఐఎం పార్టీ 67వ ఆవిర్భావ దినోత్సవం

**పెబ్బేరు, మార్చి 1 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఎంఐఎం పార్టీ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ తో పార్టీ కార్యాలయం చేరుకొని పార్టీ జెండా ఆవిష్కరించిన పెబ్బేరు మండల పార్టీ అధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ కులమత అతీతంగా అని వర్గాల సమస్యల పై పోరాడుతుంది, ప్రజలకు ఎల్లవేళలా సమస్యల పై అందుబాటులో ఉంటాడమని తెలియజేశారు, రాబోయే స్థానిక జడ్పిటిసి, మున్సిపల్ ఎలక్షన్‌లో ఎంఐఎం పార్టీ భారీలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయరాజ్, పార్టీ జనరల్ సెక్రెటరీ అమెర్, జాయింట్ సెక్రటరీ మస్తాన్, సలాం, హాజీ, ఆవేజ్, మధు, ఆఫ్రోజ్, ఫెరోజ్, షకీర్, ఎంఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం

**■ లబ్ధిదారుల సమక్షంలో ముగ్గు పోసిన గృహ నిర్మాణశాఖ డిఈ**



గోపాల్ దిన్నెలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోసిన గృహనిర్మాణశాఖ అధికారులు

**ఇటిక్యాల, మార్చి1 ప్రభాతవార్త:** గుడిసెలో మట్టి మిద్దెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి గత నెల జనవరి 26 న మండల పరిధిలోని గోపల్ దిన్నె గ్రామంలో అధికారులు వారికి ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ గ్రామంలో 62 మంది అర్హులను గుర్తించగా జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆదేశాల మేరకు శనివారం ఇటిక్యాల మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో గృహ నిర్మాణ శాఖ డీఈ నరేంద్రుడు, మండల ఎంపీడీవో మహమ్మద్ అజార్ మొహియుద్దీన్,స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలో సొంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కొలతలు పట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థలం ఉంటే ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారుల సమక్షంలో ముగ్గు పోసి ప్రారంభించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలలో ఇందు లేని నిరుపేదలను గుర్తించి ప్రజాపాలన ద్వారా అర్హులైన వారి నుండి దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించింది.కొత్త ఏడాది డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా గ్రామాలలో సర్వే చేపట్టి గుడిసెలు, మట్టి మిద్దెలు, రేకులు, బండలు వంటి వాటిలో నివసిస్తున్న వారికి అలాగే వారికి సొంత స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి మొదటి పైలెట్ ప్రాజెక్టుగా ఇటిక్యాల మండలంలో గోపల్ దిన్నె గ్రామాన్ని ఎంపిక చేసి గత జనవరి 26వ తేదీన మంజూరుపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 5 లక్షలు 4 విడతల్లో చెల్లిస్తుండగా మార్చి నాటికి బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారులకు మొదటి బిల్లు ఒక్క లక్ష రూపాయలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులోభాగంగా శనివారం గోపల్ దిన్నె గ్రామంలో శనివారం మొదటి రోజు 18 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు గృహనిర్మాణ శాఖ డిఈ నరేంద్రుడు. ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్, స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో కొలతల ప్రకారం ముగ్గుపోసి ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

## వక్ఫ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

**■ అవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్**



మాట్లాడుతున్న అఖిల పక్షం నాయకులు

**గద్వాల, మార్చి 1 ప్రభాతవార్త:** మైనారిటీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాల్మీకి కమిటీ హాల్లో అతికుర్ రెహమాన్ సభాధ్యక్షతన, అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ వక్ఫ్ బిల్లుపై పౌర చర్చ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు నియమించిన జేపీసిలో ప్రతిపక్ష సభ్యులు సూచించిన ఒక్క సవరణను కూడా ఆమోదించకుండా నియంతృత్వంగా ఆమోదించడం సరైనది కాదన్నారు.మంద బలంతో తీసుకున్న నిర్ణయాలను ఎటువంటి ప్రజాస్వామిక చర్చలు లేకుండా అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రజాస్వామిక వాదులు మేధావులు ఖండించాలని కోరారు. భిన్నత్వంలో ఏకత్వం గల దేశాన్ని ఏకపక్ష విధానాలతో రాతి యుగాలలోకి నేడుతున్న కేంద్ర ప్రభుత్వ ధమన నీతిని ఖండించాలని కోరారు. విభజన విద్వేష రాజకీయాలు పెంచి పోషించే ఉద్దేశంతో తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకునేంతవరకు జరిగే పోరాటాలలో సమాజంలో అన్ని వర్గాలు కలిసి రావాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణకు తిలోదకాలు ఇచ్చి ప్రజాతంత్ర హక్కులు కాలరాస్తూ చట్టబద్ధ రాజ్యాంగ బద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకునేంతవరకు జరిగే పోరాటాలలో కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆవాజ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జబ్బార్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫయాజ్, అఖిలపక్ష నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్ బాబు, న్యాయవాది షఫీ ఉల్లా, సిపిఎం,సిపిఐ జిల్లా కార్యదర్శులు ఏ.వెంకటస్వామి, బి.ఆంజనేయులు,తెలంగాణ ప్రజాఫ్రంట్ ప్రభాకర్, ఇసాక్,అబ్బాస్ మౌలానా, రిటైర్డ్ ప్రిన్సిపల్ జలీల్, టీచర్ బాబు, ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు రహమతుల్లా, నసురుల్లా, మహబూబ్ ఆలీ, కుర్వ పల్లయ్య, గోపాల్ రెడ్డి, సాదుతుల్ల, అక్బర్ భాష, టవర్ మక్బూల్‌తాహేర్,జమాలుద్దిన్, మాచర్ల అలీ పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



పెద్దపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**జడ్చర్ల, మార్చి 1 ప్రభాతవార్త :** విద్యార్థులు సమాజాన్ని సరియైన మార్గంలో ముందుకు తీసుకువెళ్లడంలో ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయమైనదని ప్రధానోపాధ్యాయురాలు అనురాధ అన్నారు.జడ్చర్ల మండలం పెద్దపల్లి గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులను చక్కగా బోధించారు. ఈ స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ప్రధానోపా ధ్యాయుడిగా కృష్ణ తేజ, ఇతరవిద్యార్థులు అనుష, సహస్ర, సింధు, బార్గవి,మనిచందన, నాగరాజు, వరుణ్‌తేజ్ నఉపాధ్యాయులుగా తమ పాత్రలను పోషించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయురాలు సత్యావినీల, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఉప్పునుంతల, మార్చి 1 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాలలో శనివారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవంవిద్యార్థులు జరుపుకున్నారు.25 మంది విద్యార్థులు చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించారు. జిల్లా కలెక్టర్‌గా తన్వి, మండల విద్యాధికారిగా లోకేష్, కాంప్లెక్స్ హెచ్ఎంగా హేమంత్ కుమార్, ప్రధానోపాధ్యాయులుగా కీర్తనలు వ్యవహారించారు. చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు వారు చేసిన బోధన పట్ల పలువురు హాజరై విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమానికి ఎంఈఓ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఒకరోజు ఛాత్రో ఉపాధ్యాయులుగా పనిచేసి బాధ్యతల పట్లవారు చేపట్టిన మక్కువ పట్ల ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు.భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హించి ఉన్నతమైన విద్యను అధిగమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం ఎం. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, చందన, సంగితలు సి.ఆర్.పి శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయులుగాఎంపిక కావడంతో వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**శ్రీరంగాపూర్, మార్చి1 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలం కంబలపురం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. విద్యార్థులే ఉపాధ్యాయులైతోటి విద్యార్థులకు చక్కగా విద్యాబోధన చేశారు. ఈ కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి హెచ్ఎం మాట్లాడుతూ భావి భారత పౌరులుగా తీర్చిద్దేవారు ఉపాధ్యాయులేనని ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని చెప్పడం జరిగింది. ఇందులో భాగంగా హెచ్ఎంగా నాని, ఎంఈఓగా వి.చరణ్, డీఈఓగా జి. కార్తీక్ విధులు నిర్వహించడం జరిగింది. ఉపాధ్యాయులైన ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు నలువోతుల విష్ణువర్ధన్ నాయుడు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలోపాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులువిద్యార్థుల తల్లిదండ్రులు మాజీ విద్యా కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్ నాయుడు, మల్లేష్ యాదవ్, రాజకుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

**పెబ్బేరు, మార్చి 1 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో ప్రాథమిక పాఠశాల కిష్టారెడ్డిపేటలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా పనిచేయడం వలన విద్యార్థుల మొఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. ఈ ఒక్కరోజు ఉపాధ్యాయ వృత్తిని జీవితంలో కూడ ఉపాధ్యాయులుగా ఎదగడానికి కృషి చేసి పట్టుదలతో చదివిఉద్యోగం సాధించాలని విద్యార్థులకు హెచ్ఎంచెన్నకేశవులుసూచించారు. మండలవిద్యాధికారిగా అద్విత, హెడ్మాస్టర్‌గా పురుషోత్తం, టీచర్లుగా రజిత, జ్యోతి, పల్లవి,స్వప్న,శ్రీలత, చింటూ,అరవింద్, అయేషా, సువర్ణ, ధరణి, సోమేశ్వరి, పవన్, ఆనంద్ లు ఆయా సబ్జెక్ట్ లలో వివిధ తరగతులకు పాఠాలు బోధించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా చేసినందుకు ఆనందంగా ఉందని విద్యార్థులు సంతోషం వెలిబుచ్చారు.



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

## కొనసాగుతున్న సిపిఐ నిరసన దీక్షలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సిపిఐ దీక్షలు

**ఆత్మకూరు, మార్చి 1 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాబా కాలనీలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు రోడ్డును ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నాడంటూ గడచిన మూడు రోజులుగా సిపిఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. బాబా కాలనీలో ఆత్మకూర్ మెడికల్ ప్రధాన రహదారిపై లేఅవుట్లో ప్రకటించడం వంటి రోడ్డును అక్రమంగా ఆక్రమించుకుని అక్రమ పర్మిషన్లు పొందారని ఈ విషయంపై ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిర్మాణాలు అడ్డుకునే ప్రయత్నం దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు తక్షణమే నిలిపివేయాలంటూ ఆత్మకూరులోని తహశీల్దార్ కార్యాలయం ముందు మూడు రోజులుగా దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం ఎంతవరకు సమంజసం అని విజయరాములు విలేకరులతో వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని లేనిపక్షంలో జిల్లా వ్యాపితంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఓవైపు సిపిఐ ఆధ్వర్యంలో దీక్ష కొనసాగుతున్నప్పటికీ మరోవైపు నిర్మాణ పనులు యదేచ్ఛగా కొనసాగుతూ ఉండడం విశేషం.

## భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థుల విశ్లేషణ



పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థినిలతో కళాశాల సిబ్బంది



పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న విద్యార్థిని పి.శిరీష

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతీయ వారసత్వం, సంస్కృతికి సంబంధించి సాంప్రదాయాల వెనుక ఉన్న శాస్త్రీయతపై లైఫ్ సైన్సెస్ విద్యార్థినిలే వక్తలుగా ప్రసంగిస్తూ శాస్త్రీయ కారణాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ డా. పద్మ, అనురాధ, అమీనా, ముంతాజ్ జహాన్ సమక్షంలో పూజా కార్యక్రమం అనంతరం మాటాడుతూ ఒకరికొకరు అరచేతులను జోడిస్తూ నమస్కారం చెప్పే సాంప్రదాయం, కాళీ రెండవ వేలుకు మెట్టెలు ధరించడం, రాగి మానవ శరీరానికి చాలా ఉపయోగకరమైన లోహం నదిలో నాణ్యాలు విసరడం ఒక మార్గం, నుదుటిపై రెండు కన్నుబొమ్మల మధ్య కుంకుమ లో మెర్క్యూరీ ఉంటుంది ఏకాగ్రతను నియంత్రిస్తుంది,గుడిలోకి వెళ్లే ముందు గంటను ఎందుకు మోగించాలి వంటి వాటిపై శాస్త్రీయ కార ణాలను తెలపడం జరిగింది. నజీమా మాట్లాడుతూ ఉత్తరం వైపు తల పెట్టి ఎందుకునిద్రించకూడదు, చెవులనుఎందుకు కుట్టించుకుంటారు, తినేముందు ప్రారంభంలో మాసాలతో, చివరలో తీపితో ఎందుకు ముగిస్తారు, చేతులు పాదాలకు మెహందీ ఎందుకు అప్లై చేస్తారు,కూర్చునే ఎందుకు తినాలనే వాటిపై శాస్త్రీయ కారణాలను తెలిపింది. అనంతరం విద్యార్థినిలలో గాయత్రి మాట్లాడుతూ సూర్య నమస్కారాలు ఎందు కు చేయాలి? బ్రాహ్మణుల తలపై పిలక జుట్టు లాగా ఎందుకు ఉంటుంది, ఉపవాసం ఎందుకు ఉంటాం, పాదాలకు తాకి మొక్కడం వెనుక శాస్త్రీయ రహస్యాలను చెప్పడం జరిగింది. మహేశ్వరి మాట్లాడుతూ వివాహిత స్త్రీలు సింధూరం ను ఎందుకు ధరిస్తారు, రావి చెట్టు, తులసి మొక్కను ఎందుకు ఆరాధిస్తాము, గాజులు ఎందుకు ధరిస్తారు వీటికి గల శాస్త్రీయ కారణాలను తెలిపింది. మనీషా మాట్లాడుతూ దేవాలయాలను ఎందుకు దర్శించాలి, బియ్యపు పిండితో ముగ్గు వేయడం వంటి వాటిపై శాస్త్రీ యతను తెలిపింది. రేవతి మాట్లాడుతూ అరటి ఆకులో భోజనం, నిలబడి నీరు త్రాగక పోవడం వంటి వాటిని వివరించింది. అనం తరం పి.శిరీష మాట్లాడుతూ పసుపు ఎందుకు రాసుకుం టారు, ఇంటి ముందుపేడ నీళ్లు ఎందుకు చల్లుతారు వంటి వాటిపై శాస్త్రీయ కారణాలను తెలిపింది. చివరిగా షబానా మాట్లాడుతూ వజుచేయడం, నమాజ్ చేయడం, మిస్‌వాక్‌తో పళ్ళను ఎందుకు శుభ్రం చేయాలి, హిజామా కప్ తెరపి వంటి వాటి వెనుక దాగి ఉన్న శాస్త్రీయ కారణాలను తెల పడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైస్ ప్రిన్సిపాల్ డా. పద్మ అనురాధ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ పేరుతో 1928 ఫిబ్రవరి 28న సివి రామన్ తన పరిశోధనలను ప్రతిపాదించారు.ఆరోజును గుర్తు చేసుకుంటూ దేశ ప్రజలలో వైజ్ఞానిక స్ఫూర్తిని నింపడానికి అదే ఫిబ్రవరి 28న వైజ్ఞానిక దినంగా జరుపుకుంటున్నాంఅదే స్ఫూర్తిని జంతుశాస్త్ర విభాగా నికి చెందిన లైఫ్ సైన్సెస్ విద్యార్థులు మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను చాలా చక్కగా వివరించడం జరిగిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలోలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. జె. శ్రీదేవి, పీజి కోఆర్డినేటర్ డా.ఎం ప్రవీణ్ కుమార్, జంతు శాస్త్ర అధ్యాపకులైన నసీం భాను, బి. శ్రీలత, వెంకటరమణమూర్తి, మల్లేష్ పాల్గొన్నారు.

## బీసీ వర్గాన్ని సస్పెండ్ చేసినట్లే.!



సమావేశంలో మాట్లాడుతున్న దాసర్ల వెంకటస్వామి

**బిజినేపల్లి, మార్చి 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై టీపీసీసీ పార్టీ నుండి సస్పెండ్ సస్పెండ్ చేయడం, బీసీ వర్గాన్ని సస్పెండ్ చేసినట్లే అని బీసీ సంఘాల ఐక్యవేదిక మండల గౌరవ అధ్యక్షులు దాసర్ల వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీసీ సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడం కోసం తీన్మార్ మల్లన్న చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పునరాలోచించి సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీల ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షాన మాట్లాడిన తీన్మార్ మల్లన్నను పక్కన పెడితే తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాన్ని పక్కన పెట్టినట్లుగా, గుర్తుంచుకోవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఇలాంటి నిర్ణయాలకు ప్రభుత్వానికి బీసీ వర్గాల నుండి వ్యతిరేకత తప్పదన్నారు. గతంలో టిపిసిసి అధ్యక్షునిగా ఉన్న రేవంత్ రెడ్డిని అదే పార్టీలోని అగ్రవర్ణాలు అవాకులు చవాకులు మాట్లాడిన క్రమశిక్షణ చర్యలు తీసుకొని పార్టీ నేడు బీసీ వర్గానికి చెందిన మల్లన్నపై చర్యలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. 4వ తేదీన మండల కేంద్రంలోని ఎంజెఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబోయే బీసీ చైతన్య సదస్సుకు అన్ని గ్రామాల బీసీ కులాల కమిటీల సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో రాజేందర్ గౌడ్, సత్య శిలసాగర్, రామన్ గౌడ్, పొట్టలఆదినారాయణ, కల్మూరు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు వనపర్తికి సీఎం రేవంత్ రెడ్డి

◆ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
◆ టీఎంఎఫ్‌డిసి కింద కుట్టు మిషన్ యంత్రాల పంపిణీకి శ్రీకారం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 1 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకం కింద పదివేల కు పైగా పుట్టు మెషిన్లను అందించే కార్యక్రమానికి వనపర్తి జిల్లా కేంద్రంగా శ్రీకారం చుట్టనున్నారు. వనపర్తి జిల్లాలో తనకు ఉన్న అనుబంధాన్ని మిత్రులను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కలుసుకొని ఉన్నారు. గతంలో తన జ్ఞాపకాలను నెమరు వేసుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిన్నతనంలో తన అన్నగారైన భూపాల్ రెడ్డి వనపర్తి పట్టణంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా ఉన్న సమయంలో వారి యొక్క చదువులకోసం వల్లభనగర్‌లోని ఎం .ఈశ్వర్, పార్వతమ్మ దంపతుల ఇంట్లో అద్దెకు ఉండేవారు. 2005లో ఈశ్వర్ స్వర్గస్తులయ్యారని, ఇప్పటికి రేవంత్‌రెడ్డి ఆ రోజుల్లో ఎలా ఉండేవాడో ఇప్పటికి కూడా అక్క అక్క అంటూ ఆప్యాయతగా పిలుస్తారని, తన పిల్లలతో పాటుగా తాను కూడా పెరిగాడని, రేవంత్ చిన్ననప్పటి నుంచి కూడా తాను ఏదైనా అనుకుంటే అది సాధించేంతవరకు వదిలిపెట్టేవాడు కాదని పార్వతమ్మ తెలిపారు. రేవంత్ ఏడుగురి అన్నదమ్ములలో ఐదు మంది ఇక్కడే ఉండి చదివే వారని ఆమె వివరించారు. రేవంత్ రెడ్డికి ఏడుగురు సోదరులు. ఒక సోదరి ఉన్నారు.పెద్దన్న భూపాల్ రెడ్డి రిటైర్డ్ ఎస్సై, రెండో అన్న కృష్ణారెడ్డి సర్పంచ్‌గా పనిచేసారు. మరో అన్న తిరుపతి రెడ్డి కొడంగల్ కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా ఉన్నారు. ఇంకో అన్న జగదీశ్వర్ రెడ్డి యూఎస్‌లో స్థిరపడ్డారు. మరో ఇద్దరు సోదరులు కొండల్ రెడ్డి, కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారాలు చేస్తున్నారు. రెడ్డి పార్వతమ్మ భర్త అయిన ఎం. ఈశ్వర్ బిజెపి పార్టీలో ఉండేవారని ప్రతినిత్యం తను ఆర్ఎస్ఎస్ శాఖ కొరకై పక్కనే ఉన్న టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ కు వెళ్లేవారని తనతో పాటుగా రేవంత్ కూడా చాలా చురుకుగా శాఖకు వెళ్లేవారని ఆవిడ గుర్తు చేశారు.

## గల్లంతైన 8 మంది జాడ కోసం అన్వేషణ కొనసాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ సహాయక చర్యలు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ కింద మరో నలుగురి ఆనవాళ్లు కన్పించినట్లు తెలుస్తోందని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా 200 కిలోమీటర్ల మేర సొరంగాలు తవ్వామని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులు తమ పదేండ్ల పాలనలో ఎస్ఎల్బీసీ సొరంగాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. అప్పుడే పూర్తి చేసి ఉంటే ఈ ఘటన జరిగేది కాదేమోనని తెలిపారు. సొరంగంలో చాల క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయని, ప్రతిపక్షాలు విమర్శిస్తున్నట్లు సహాయక చర్యల్లో నిర్లక్ష్యం ఏమి లేదని, ఎస్ఎల్బీసీపై నిస్సిగ్గుగా రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేత



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బిజినేపల్లి, మార్చి 1 ప్రభాతవార్త: విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యం పెంపొందించడంతో కొత్త కొత్త ఆవిష్కరణలు జరుగుతాయని, పిల్లల్లో మనో వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని హెచ్‌ఎం కురుమయ్య అన్నారు. గంగారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విజేతలుగా ఇచ్చిన అల్లీపూర్ విద్యార్థులను ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు. హెచ్‌ఎం కురుమయ్య మాట్లాడుతూ విద్యార్థులు సొంతంగా తయారు చేసిన పలు ప్రాజెక్టు వర్క్స్ ,వాటి పనితీరు భవిష్యత్తులో వారికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఏడవ తరగతి చదువుతున్న పూజ టార్పాలిన్ ఫార్మర్ కిట్ తయారుచేసి మొదటి బహుమతి పొందగా, కావ్య శ్రీ ధూమపానం ఆరోగ్యానికి హానికరం అంశంపై తయారు చేసిన ప్రాజెక్టులో ద్వితీయ బహుమతి సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు జహంగీర్ రాజ్యలక్ష్మి, రాధాకృష్ణ, విద్యావతి, మహేశ్వరి పిఏసిఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, డైరెక్టర్ వెంకటస్వామి అభినందించారు.

## మాదిగ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


**వెల్దండ, మార్చి 1 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల అంబేద్కర్ విగ్రహం ముందు 30 సంవత్సరాల ఎస్సి వర్గీకరణ సాధన పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరులను స్మరిస్తూ ఎమ్మార్పీఎస్, మాదిగల ఐక్య వేదిక నాయకుల ఆధ్వర్యంలో మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిగ నాయకులు మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉప కులాల విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, గత 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ సామాజిక ఉద్యమాన్ని మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో గ్రామ గ్రామాన ఉధృతం చేసి రిజర్వేషన్లను సాధించే క్రమంలో ఎందరో మాదిగ అమరవీరుల తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించిన వర్గీకరణ తుది ఫలితమే సుప్రీం కోర్టు తీర్పని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ నాయకులు ప్రభాకర్, జంగయ్య, పుల్లయ్య, రామస్వామి, కురుమిద్ద యాదగిరి, తక్కళ్ళపల్లి శేఖర్, పోలే అశోక్, సామెల్, రాజు, నాగేశ్వర్, రమేష్, గెల్వయ్య, లింగం, మల్లేష్, లక్ష్మణ్, నాగయ్య, ప్రకాష్, సాయి, కొమ్ము అంజయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 3 సైన్స్ సెమినార్

**మహబూబ్ నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో భౌతిక, జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై సైన్స్ సెమినార్ ఎఎస్ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు మార్చి 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని , జిల్లాలోని జిల్లాపరిషత్ ,ప్రభుత్వ పాఠశాలభౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులందరూ తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

## అక్రమ నాటు సారాపై ఉక్కు పాదం

**వెల్దండ, మార్చి 1 ప్రభాతవార్త:** అక్రమంగా నాటు సార తయారు చేసిన, విక్రయించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకొని వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎక్సైజ్ సీఐ జే.వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ కల్వకుర్తి ఆధ్వర్యంలో మండలంలోని గుండాల జాతర సందర్భంగా అక్రమ నాటు సారా తయారీ, అమ్మకం నియంత్రణ కోసం కళ్యాణ వాగు తండా,రామోజీ తండా,బొల్లంపల్లి తండాలలో విస్తృతంగా దాడులు నిర్వహించి ఇట్టి దాడుల్లో సుమారు 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జాతర సందర్భంగా నాటు సారా విక్రయం, మద్యం అమ్మకాలపై నిఘా పెట్టామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుఉంటాయన్నారు.కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి, రఘు, నారాయణ, పరుశురాం తదితరులు ఉన్నారు.



నాటుసారా తయారీని ధ్వంసం చేస్తున్న దృశ్యం

# కొత్తదనం కావాలని..నన్ను వదిలేశారు!

◆ కొత్త భవనాన్ని నిర్మించారు.. పాత భవనాన్ని వదిలేశారు

**ఉప్పునుంతల, మార్చి1 ప్రభాతవార్త :** నేను ఎన్నో సంవత్సరాల నుంచి ఎంతోమందికి జీవం పోశాను... రోగం నయం చేశాను.. కానీ కొంతమంది నాపై జీర్ణించుకోలేక ఈర్షపడి.. దురుద్దేశంతో గత పాలకులకు తప్పుడు సమాచారం అందించి నన్ను వదిలేశారు... కానీ నేను ఎవరిని ఎంతమందిని బతికించాననే విశ్వాసం నాకుంది. కానీ కొంతమంది నాపై ఈర్ష్య పొంది.. నాపై లేనిపోని చాడీలు చెప్పి ఇంతమందికి జీవం పోసిన నన్ను వదిలేశారు. నన్ను వదిలేయడానికి కొంతమంది చేసిన కుట్ర వారికి పాపాన పోలేదు. రోడ్డుపై వెళ్తున్న ప్రతి ఒక్కరూ నన్ను చూసి ఛీ కొడుతున్నారు. ఈ పాపం నాపై ఈర్ష్య పొందిన వారికి నా పాపం తగులకపోదని.. శాపనార్థం పెడుతున్న ఓ ప్రభుత్వ భవన దుస్థితి ఇలా నెలకొంది. మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనం సరిపోదని గతంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రత్యేక చొరవ తో వైద్య విధాన పరిషత్ పరిధిలో 30 పడకల ఆసు పత్రిని భవనాన్ని నిర్మించారు. కానీ పాత భవనం తొలగించక పోవడంతో పూర్తిగా అటవీ ప్రాంతంగా మారిపోయింది. పాత ఆసుపత్రిలో విషపురుగుల బెడద అధికంగా ఏర్పడింది. పాద ఆసుపత్రి భవనం గురించి ఎవరు పట్టించుకోకపోవడం, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కొంతమంది స్వార్థపరుల మాటలు పట్టుకొని భవనాన్ని కూలగొట్టకుండా నూతన భవనాన్ని నిర్మించారు. అచ్చంపేట ఉప్పునుంతల ప్రధాన రహదారిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు, విషపురుగుల బెడద అధికంగా పెరిగిపోయింది. గతంలో ఎంతో ప్రయోగాత్మకంగా నిర్మించిన భవనానికి కృషి చేసిన మహనీయులు పాత భవనం శిథిలావస్థకు వచ్చిన ఎందుకు పట్టించుకోవడం లేదు అర్థం కావడం లేదు. మాజీ ఎమ్మెల్యేకు పలు సూచనలు, సలహాలు అందించిన మహానుభావులు ఇప్పుడుఏం చేస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో తప్పుడు సమాచారాలు అందించిన వారు (మేధావులు) ఇప్పుడు ఏం చేస్తున్నారని ఆ ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు. గత మాజీ ఎమ్మెల్యేకు ఇచ్చిన సలహాదారులు ఎక్కడికి వెళ్లారని, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ వద్ద తప్పుడు సమాచారాలు చెల్లవని తెలిసిపోయిందని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. నిజాం నిదానంగా తెలుస్తుందని, గతంలో పలువురు పాత ఆసుపత్రి భవనాన్ని తొలగించి నూతన భవనానికి పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఎంత చెప్పినా వినకుండా కొంతమంది స్వార్థపరుల మాటలు పట్టుకున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రమేయంతో నూతన భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని, గతంలో ఇచ్చిన సలహా దారుల మాటలు పట్టించుకోకుండా పాత భవనాన్ని తొలగించి 30 పడకల ఆసుపత్రికి లేకుండా చూడాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఏ కరువు పెట్టుకున్నారు. మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన భవనం పట్ల ప్రత్యేక చర్య తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యేకు సూచించారు.



శిథిలావస్థకు చేరుకున్న ఉప్పునుంతల పాత ఆసుపత్రి

## ప్రతి దివ్యాంగులకు యూడిఐడి నంబరును కేటాయించాలి

**గద్వాల,, మార్చి ప్రభాతవార్త :** ప్రతి దివ్యాంగులకు యూడిఐడి నంబర్‌ను కేటాయించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం, హైదరాబాదు నుంచి సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, దివ్యాంగులకు యూనిక్ ఐడి జారీ, సౌర విద్యుత్ ప్లాంట్లపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ బదులు యూనిక్ డిసేబులిటీ ఐడి జారీ చేయాల్సి ఉంటుందని, సదరం సర్టిఫికెట్ నుంచి ఈ కార్డు జారీకి బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. దివ్యాంగులకు వైద్యులచే ధృవీకరించిన వైకల్య శాతంతో కూడిన సదరం సర్టిఫికెట్ ను యూడిఐడి పోర్టల్ లో నమోదు చేయాలని, దివ్యాంగులకు సంబంధించి ఇతర వివరాలు సంపూర్ణంగా నమోదు చేయాలన్నారు. దివ్యాంగులకు యూడిఐడి కార్డు స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా ఇంటి చిరునామాకు అందుతుందని సీఈఓ తెలిపారు. అంధులకు విజన్, కుష్టు వ్యాధి గ్రస్థులు, వినికిడి సమస్య గలవారు, అంగవైకల్యం గలవారు, మానసిక వైకల్యం గల వారికి వైకల్య శాతాన్ని పరిశీలించి యూడిఐడి కార్డులు జారీ చేయాలన్నారు. నూతనంగా యూడిఐడి కార్డుల కోసం మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సదరం సర్టిఫికెట్ ఉన్నవారికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ద్వారా యూడిఐడి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 28, 2025 వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లతో పెన్షన్, ఇతర సదుపాయాలను తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగులు పొందవచ్చని, ఇతర రాష్ట్రాల్లో ఏదైనా సౌకర్యం పొందాలంటే దివ్యాంగులకు యూడిఐడి కార్డు తప్పనిసరన్నారు. మార్చి ఒకటి నుంచి దివ్యాంగులకు యూడిఐడి జారీ చేయడం జరుగుతుందని,వీటి ద్వారానే పెన్షన్, ఇతర సౌకర్యాలు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న మీసేవా కేంద్రాల నిర్వాహకులకు, పంచాయతీ కార్యదర్శులకు, విఓఏలకు, సీసీలకు, ఎంపీడీఓలకు, ఏడిఎంలకు యూడిఐడి దరఖాస్తుల నమోదుపై శిక్షణ అందించాలన్నారు. ఆసుపత్రిలో యూడిఐడీ నిర్ధారణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు నిర్వహణలో దివ్యాంగులకు కుర్చీలు, తాగునీరు, తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ తో సమన్వయం చేస్తూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి, నూతనంగా కావాల్సిన సదుపాయాలపై ప్రతిపాదనలు అందజేయాలని సీఈఓ కలెక్టర్లకు సూచించారు. నూతనంగా యూడిఐడి కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూడిఐడి కార్డు కేటాయించాలన్నారు. ప్రధానమంత్రి కుసుం పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాల్లో స్థలాలను గుర్తించడం జరిగిందని, అక్కడ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసే విధంగా డీపీఆర్ లను తయారు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, అదనపు కలెక్టర్ నర్సింగరావు, డి. డబ్ల్యూ.ఓ. సునంద, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంతోష్ , అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, అధికారులు

## బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదు

■ బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత బీసీల గురించి మాట్లాడడం, బీసీలకు 46 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాట్లాడే నైతిక హక్కు ఆమెకు లేదని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మొదల శ్రీనివాస్ సాగర్ విమర్శించారు. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని బీసీలు ఈరోజు గుర్తుకు వస్తున్నారని, అధికారానికి దూరమై ఒక సంవత్సరం గడిచిన సందర్భంలో మళ్ళీ అధికారంలోకి రావడానికి బీసీల బాట పట్టడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కలిసేందుకు అవకాశం లేకుండా ఉన్న మీరు మీ ప్రభుత్వం ఈరోజు బిసిల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూ ఇంటింటి తలుపు తట్టడం బీసీ ల గురించి మాట్లాడడం బీసీల పక్షపాతిగా ఉన్నట్లు నటించడం బీసీ సమాజం నమ్మదని, మీకు నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ నెలలో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంబీసీకి సీటు కేటాయించి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, అప్పుడే బీసీ సమాజం మిమ్ములను కొద్దిగా అయినా నమ్మే అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ కవితకు సవాలు విసిరాడు. మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిన సర్వే రిపోర్టును ఎందుకు బహిర్గతం చేయలేదని, చేస్తే బీసీలకు 52 శాతం రిజర్వేషన్ అమలు చేయవలసి వస్తుందని అదేవిధంగా రాజకీయపరంగా, ఉద్యోగ పరంగా, ఆర్థికపరమైన అవకాశాలు కల్పించవలసి వస్తాయని ఆరోజు దాచిపెట్టిన మీరు ఈరోజు రిజర్వేషన్ అమలు చేయాలని బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడడం మీకే చెల్లుతుందని శ్రీనివాస్ సాగర్ ఎద్దేవా చేశారు. బీసీ సమాజ్ గతంలో చెప్పినట్లుగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి నిజంగా ఉంటే కార్యనిర్వాక అధ్యక్షుడిగా బీసీని నియమించాలి రేపు మీరు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని స్పష్టంగా బీసీ సమాజానికి హామీ ఇచ్చిన తర్వాతనే మీరు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు ఉంటుందన్నారు. బీసీల రాజ్యాధికారం గురించి రిజర్వేషన్ల గురించి పోరాడేందుకు తెలంగాణ రాష్ట్రంలో చాలామంది బీసీ మేధావులు, బీసీ రాజకీయ నాయకులు, బీసీ విద్యార్థి సంఘం నాయకులు, బీసీ ప్రజా సంఘ నాయకులు ఉన్నారని మీరు అధికారం కొరకు బీసీ వాదాన్ని ఉపయోగించుకోవాలని చూడడం బీసీ సమాజ్ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మికాంత్, నాయి బ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడు అశ్విని సత్యం, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సత్యనారాయణ సాగర్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి. శేఖర్, బీసీ సమాజ్ మహబూబ్ నగర్ పట్టణ కో కన్వీనర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు..




మాట్లాడుతున్న బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్

## తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలి

బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు నల్ల తిరుపతయ్య గౌడ్ డిమాండ్

**మూసాపేట్, మార్చి 1 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని మూసాపేట మండల బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షులు నల్ల తిరుపతయ్య గౌడ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడాన్ని పొలిటికల్ జెఏసి తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం తీన్మార్ మల్లన్న కృషి ఎంతో ఉందని తెలంగాణ సమాజానికి తెలుసని ఆయన అన్నారు. తీన్మార్ మల్లన్న సేవలు కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఎంతగానో ఉపయోగించుకోవడం జరిగిందని అలాంటి వ్యక్తిని సస్పెండ్ చేయడం దౌర్భాగ్యం అని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్‌కే నైతికత లేదని మల్లన్నను ఏ విధంగా సస్పెండ్ చేశారని బీసీల పక్షాన బీసీ కులగణన సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేయడం మల్లన్న చేసిన పాపమా అని ఆయన ప్రశ్నించారు. బీసీలకు ఓ న్యాయం ఓసిలకు ఓ న్యాయమా అని ఆయన ఆవేదన చెందారు. తెలంగాణ బీసీ సమాజం మల్లన్నకు పూర్తి సపోర్టుగా ఉంటుందని ప్రభుత్వం పునరాలోచించి తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాయతీపై పంట రుణాల పరిమితిని పెంచిన కేంద్రం ప్రభుత్వం

**మహబూబ్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త :** ప్రస్తుతం రాయితి పై ఇస్తున్న పంట రుణాల పరిమితిని రూ. 3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. శనివారం ప్రధాన మంత్రి రైతులతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో మార్టిగేజ్ లేకుండా బ్యాంకులు ఇచ్చే పంట రుణాల పరిమితిని కూడా వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి లక్ష అరవై వేల నుండి రెండు లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.హన్వాడ మండలం టంకర రైతు వేదికలో జరిగిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ వెంకటేష్, జిల్లా పశు సంవర్ధక అధికారి మధుసూధన్ గౌడ్, నాబార్డ్ బ్యాంకు ప్రధాన కార్యదర్శి కాల్వ భాస్కర్ , మండల స్థాయి వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖ అధికారులు, బ్యాంకు మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

## వెలగని వీధి దీపాలు.. తొలగని చీకట్లు

◆ పట్టించుకోని పంచాయతీ అధికారులు

**నవాబుపేట, మార్చి1 ప్రభాతవార్త:** వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని రాత్రి సమయంలో దారిలో చీకటి కమ్మి ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే కష్టంగా ఉందని అమ్మాపూర్ గ్రామ ప్రజలు వాపోతున్నారు. అమ్మపూర్ గ్రామంలో తూతూ మంత్రంగా వీధి దీపాలు ఏర్పాటు చేసినా, అక్కడక్కడ విధి దీపాలు పాడైపోయి ఉన్నాయి. గ్రామ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలంటున్నారు. వీధి దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయే తప్ప,చాలా చోట్ల స్తంభాలకు లైట్లు వెలగడం లేదని ఇంతవరకు కొత్తవి ఏర్పాటు చేయలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రాత్రి సమయంలో ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటే తీవ్ర భయాందోళన చెందుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో విషపురుగుల సంచారం అధికంగా ఉండడంతో పొద్దు గూకితే ఇళ్లలోనుంచి బయటకురాలేకపోతున్నట్లు చెబుతున్నారు. పగలు ఎండి వేడిమి కూడా అధికంగా ఉండడంతో విషపురుగులు ఎక్కువగా గ్రామాల్లోకి వస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వీధి దీపాలు వెలగక చీకటి అలుముకున్న దృశ్యం

## మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి



టిజిఎంఎఫ్‌సి చైర్మెన్, పిసిసి ఉపాధ్యక్షులు ఒబెదుల్ల కొత్వాల్‌ను మెమెంటోతో సత్కరిస్తున్న దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

కల్పనకు శ్రీకారం చుడుతుందని, విద్యావంతులైన నిరుద్యోగ మైనారిటీల కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణలను అమలు చేస్తోందని, శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో నేడు (ఆదివారం) ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కుట్టు యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి విడతలో భాగంగా 10,490 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా31,740 కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.అనిత మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్,జిల్లామైనారిటీచైర్మన్ ఫయాజ్,హాది, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అవేజ్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలి,జహీర్, తఖి, సదతుల్ల, షా ఫైసల్ పాల్గొన్నారు.

## 8 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

శిథిలాల తొలగింపు, బురద తొలగింపు పనులను వేగవంతం చేసినట్లు వివరించారు.నిపుణుల పర్యవేక్షణలో, సొరంగం లోపల మట్టి, బురద, కాంక్రీట్ శిథిలాల తొలగింపు, విరిగి పడిన పరికరాలను గ్యాస్ కట్టర్లతో కట్ చేసే పనులు చేపడుతున్నట్లు వివరించారు. సహాయక బృందాలతో మూడు షిఫ్టుల్లో సహాయక చర్యలు చేపడుతూ, డీవాటరింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. త్వరగా రెస్క్యూ ఆపరేషన్‌ను పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఇక టన్నెల్లో ఊట నీటిని తొలగించేందుకు డీవాటరింగ్ నిరంతరం కొనసాగుతోంది. సిల్ట్ తొలగింపు కోసం ఒక ఎక్స్కవేటర్ సొరంగం లోపల పని చేస్తుందన్నారు. సింగరేణి నుంచి మరో 200 మంది సహాయక చర్యల్లో పాల్గొనేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకున్నారు.ఇప్పటికే టన్నెల్ వద్ద 100మంది వరకు సింగరేణి రెస్క్యూ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి అదనంగా భూగర్భ టన్నెళ్లలో ప్రమాదాల నుంచి రక్షించే సుశిక్షితులైన సిబ్బందిని రప్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సొరంగంలో జీపీఆర్ పరికరంతో గుర్తించిన సర్ఫేస్ డిస్టబెన్స్ చిత్రాలను నిపుణులు విశ్లేషిస్తున్నట్లు తెలిపారు.సొరంగ ప్రమాద ప్రాంతంలోని శిథిలాలను బురదను తరలించడానికి కన్వేయర్ బెల్టును సిద్ధంచేస్తున్నట్లు వివరించారు.టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం)ను తెప్పించింది. అల్ట్రా థర్మిక్ కట్టింగ్ మెషిన్ యొక్క 2వ యూనిట్ నుండి వచ్చింది లోపలికి పంపబడుతుంది. దీనితో, 2 యూటీసీ పనిచేస్తాయి. షిఫ్ట్‌కు 120 మంది చొప్పున పని చేస్తున్నట్లు 3 షిఫ్టులలో 24/7 మాన్యువల్‌గా సిల్ట్ తొలగింపు చేపడుతున్నారు. సైన్యానికి చెందిన 2 బాబ్‌క్యాట్ యూనిట్‌లు పనిచేస్తున్నట్లు వివరించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో పాటు కల్నల్ పరీక్షిత్ మెహ్రా శనివారం ఉదయం షిఫ్ట్‌లో లోపలికి వెళ్లారు. సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ డిఐజి మోహ్సెన్ షహది, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న, నేవీ అధికారి వికె ప్రసాద్, రాబిన్సన్ టన్నెల్ అధికారి గ్లెన్, ర్యాట్ మైనర్స్ బృందం ప్రతినిధి ఫిరోజ్ కు రేషి, టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్. సి.యం.డి.ముషారఫ్ అలీ, ఢిల్లీ నుంచి వచ్చిన ఆర్మీ అధికారులు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, టీఎస్ఎస్ పీడిసిఎల్ సి ఎండి ముషరఫ్ అలీ, కర్నల్ పరీక్షిత్ మెహ్రా, అమిత్ కుమార్ గుప్తా, కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్.పి గైక్వాడ్ రఘునాథ్, జిల్లాయంత్రాంగంతదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

